సాక్షి
వికారాబాద్
గురువారం । 18 । ఏప్రిల్ । 2024



మూడేళ్లయినా

మండల పరిధిలోని రోడ్లు అధ్వానంగా మారాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



పేదింటి బిడ్డకు పెద్ద కొలువు

వికారాబాద్ జిల్లా పూడూరు మండలం మంచన్‌పల్లికి చెందిన తరుణ్ సివిల్స్ ఫలితాల్లో సత్తాచాటాడు. 8లో▸



ఎమ్మెల్యే మోసం చేశారు

ఎమ్మెల్యే టీఆర్‌ఆర్ గెలుపుకోసం ఎంతో కృషి చేశానని, అయినా తనను మోసం చేశారని శరత్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. 9లో▸

న్యూస్‌రీల్

స్వశక్తితో ఆర్థికాభివృద్ధి సాధించాలి

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



కృష్ణయాదవ్ కుటుంబ సభ్యులతో ప్రసాద్‌కుమార్

మర్పల్లి: ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన రంగంలో రాణించి ఆర్థికాభివృద్ధి సాధించాలని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గూడెం కృష్ణయాదవ్ గృహప్రవేశం కార్యక్రమం హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లడుతూ.. ప్రతిఒక్కరూ ఒక స్థితికి చేరుకున్న తర్వాత సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. శ్రీనివాస్ యాదవ్ పేదరికం నుంచి స్వశక్తితో ఎదిగి నేడు సొంత ఇల్లునిర్మించుకోవడం అభినందనీయం అన్నారు. సహకార సంఘం చైర్మన్ ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షుడు ఫసీయుద్దీన్, కాంగ్రెస్ నాయకులు రాములు యాదవ్, రాచన్న, బలవంత్‌రెడ్డి, వెంకట్ తదితరులున్నారు.

శ్రీరామ నవమి వేడుకల్లో కేంద్రమంత్రి

- సతీసమేతంగా హాజరైన కిషన్‌రెడ్డి
- స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాల సమర్పణ



స్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దంపతులు

కందుకూరు: మండల పరిధిలోని తిమ్మాపూర్ రామాలయంలో బుధవారం నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. స్వామి, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, ఎంపీపీ మంద జ్యోతిపాండు, నాయకులు అమరేందర్‌రెడ్డి, నిరంజన్, భిక్షపతి, పాండు, రమేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా విజయ్‌కుమార్



ఇబ్రహీంపట్నం రూరల్: బీజేపీ యువ మోర్చా జిల్లా కార్యదర్శిగా మైలారం విజయకుమార్ నియమితులయ్యారు. బీజేవైఎం రంగారెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షుడు యాదీష్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మండల కేంద్రానికి చెందిన విజయ్‌కుమార్ బీజేపీలో చురుకైన పాత్ర పోషించారు. పార్టీ అభివృద్ధికి చేసిన కృషిని గుర్తించిన అధిష్టానం కార్యదర్శిగా నియమించింది.

ఆ పరిశ్రమలపై చర్యలు తీసుకుంటాం

రాష్ట్ర పర్యావరణ నియంత్రణ బోర్డు మెంబర్ సత్యనారాయణరెడ్డి

చేవెళ్ల: ప్రజలకు ఇబ్బంది కలిగించే కాలుష్యకారకాలపై తెలంగాణ రాష్ట్ర పర్యావరణ నియంత్రణ బోర్డు ఆధ్వర్యంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బోర్డు మెంబర్ చింపుల సత్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బోర్డు సెక్రటరీ బుద్ధ ప్రసాద్ ఐఏఎస్ అధ్యక్షతన నగరంలో బోర్డు సభ్యుల సమావేశం నిర్వహించారని.. చేవెళ్ల ప్రాంతంలోని పలు సమస్యలను బోర్డు దృష్టికి తీసుకెళ్లామన్నారు. తాండూరులోని ఏసియన్ బ్రౌన్ ఫ్యాక్టరీ నుంచి వెలువడే కాలుష్యంతో గ్రామస్తులు, విద్యార్థులు ఇబ్బందులు గురవుతున్నారని.. చందనవెల్లిలోని కుందన్ టెక్స్‌టైల్స్, శంషాబాద్ శ్రీకృష్ణ డ్రగ్స్‌తోనూ పర్యావరణం కాలుష్యమవుతోందని చెప్పానన్నారు. మోకిలలో నిర్మిస్తున్న విల్లాలు, అపార్ట్‌మెంట్‌ల నిర్మాణ వ్యర్థాలు గండిపేట చెరువులోకి వదులుతున్నారని ప్రస్తావించానన్నారు. మోకిలలోని నిర్మాణాలను సందర్శించి చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు బోర్డు నిర్ణయించిందని చెప్పారు. మొదటిసారి సమావేశానికి హాజరైన నూతన మెంబర్లను బోర్డు ఆధ్వర్యంలో సన్మానించినట్టు వివరించారు. పరిశ్రమలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. పర్యావరణానికి, ప్రజలకు హాని కలిగించే పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పీసీబీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పరిగి: ఉత్సవమూర్తులకు జలాభిషేకం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

జై శ్రీరామ్

శ్రీరామనవమిని పురస్కరించుకొని బుధవారం జిల్లాలోని ప్రధాన పట్టణాలు, గ్రామాల్లోని ఆలయాల్లో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీరాముడి విగ్రహాలతో పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. జై శ్రీరామ్ నినాదాలతో వీధులన్నీ మార్మోగాయి. ప్రముఖులు పూజల్లో పాల్గొని ప్రజలకు రామనవమి శుభాకాంక్షలు తెలిపారు.

– సాక్షి, నెట్‌వర్క్



బొంరాస్‌పేట: కల్యాణ వేడుకను తిలకిస్తున్న భక్తులు

అటకెక్కికిన 'బృహత్'

- జిల్లాలో 19 బృహత్ పల్లె ప్రకృతి వనాల ఏర్పాటుకు ప్రణాళిక
- ఏడాది క్రితమే స్థలాల కేటాయింపు పూర్తి
- శాఖల మధ్య సమన్వయ లోపంతో వనుల్లో తీవ్ర జాప్యం
- అందుబాటులోకి తేవాలంటున్న ప్రజలు



ధారూర్ మండలం కుక్కింద గ్రామంలోని పల్లె ప్రకృతి వనం

వికారాబాద్: బృహత్ పల్లె ప్రకృతి వనాల ఏర్పాటు అటకెక్కినట్లు కన్పిస్తోంది. ఏడాది క్రితమే స్థలాల పరిశీలన పూర్తిచేసిన అధికారులు వాటి ఏర్పాటు కోసం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కొన్నిచోట్ల పనులు ప్రారంభించినప్పటికీ అవి ముందుకు సాగడంలేదు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు, పట్టణాల్లో పట్టణ ప్రకృతి వనాలు, అర్బన్ పార్కుల పేరుతో పచ్చదనాన్ని పెంచే కార్యక్రమానికి తోడు మండలానికొకటి చొప్పున బృహత్ పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఎనిమిది ఎకరాల విస్తీర్ణంవీటిని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఏడాది క్రితమే స్థలాల పరిశీలన పూర్తిచేసినప్పటికీ యంత్రాంగం వీటి ఏర్పాటుపై ఆసక్తి చూపడం లేదని సమాచారం.

సమన్వయలోపం...

బృహత్ పల్లె ప్రకృతి వనాల స్థల పరిశీలన బాధ్యతలను రెవెన్యూ యంత్రాంగం చూడగా.. ప్రకృతి వనాల అభివృద్ధి బాధ్యతలు మండల పరిషత్, ఉపాధి హామీ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఏ మొక్కలు నాటాలి, ఎన్ని నాటాలి తదితర వాటిని ఫారెస్టు అధికారులు పర్యవేక్షిస్తారు. పచ్చదనాన్ని పెంచటంతో పాటు ఆహ్లాదాన్ని పంచేలా వనాల్లో కుర్చీలు, చిన్నపిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో మొదటి ఏడాది మొక్కలు నాటడం..వాటి పెంపకం లాంటి కార్యక్రమాలు చేపట్టాలని, రెండవ ఏడాది నుంచి వనాలను అభివృద్ధి చేయటం, వాటిలో వసతులు కల్పించటం లాంటి పనులు చేపట్టాలని నిర్ణయించారు. అయితే శాఖల మధ్య సమన్వయలోపంతోనే ఇప్పటికీ పనులు ప్రారంభం కావడంలేదనే విమర్శలున్నాయి.

మండలానికొకటి చొప్పున..

జిల్లాలో మండలానికొకటి చొప్పున మొత్తం 19 బృహత్ పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. స్థలాల లభ్యతను బట్టి మండల కేంద్రాలకు సమీపంలో లేదంటే మండలంలో ఏదో ఒకచోట ఈ వనాలకు స్థలాలను కేటాయిస్తారు. ఒక్కో బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని 8 ఎకరాలకు తక్కువ కాకుండా ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో వనంలో సగటున 33వేల చొప్పున మొక్కలు నాటనున్నారు. కాగా ఇప్పటికే ప్రతి మున్సిపాలిటీకి ఒకటి చొప్పున జిల్లాలో నాలుగు అర్బన్ పార్కుల ఏర్పాటుకు స్థలాల కేటాయింపు ప్రక్రియ కూడా పూర్తయ్యింది. అలాగే గ్రామానికొకటి చొప్పున జిల్లాలో మొత్తం 715 పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. బృహత్ పల్లె ప్రకృతి వనాలను కూడా త్వరగా ఏర్పాటు చేసి అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు ప్రారంభించాలి



బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో బృహత్ పల్లె ప్రకృతి వనాల స్థలాలు సేకరణ ప్రక్రియ పూర్తయ్యింది. అధికారులు వెంటనే పనులు ప్రారంభించాలి. పల్లె ప్రకృతి వనాల తరహాలోనే బృహత్ ప్రకృతి వనాలు కూడా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

– విజయ్ కుమార్, జెడ్పీ వైస్ చైర్మన్

ఒకే కుటుంబం.. కేంద్రాలనేకం!

- నగరంలో వింత పరిస్థితి
- పోలింగ్ శాతం తగ్గుదలకు ఇదీ ఓ కారణం!

సాక్షి, సిటీబ్యూరో: ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన ఓ కుటుంబంలో భార్యాభర్తలతో పాటు వారిద్దరి పిల్లలకు ఓటు హక్కు ఉంది. అందరి పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓటేసేందుకు అందరూ కలిసి వెళ్లవచ్చులే అనుకున్నారు.అందరూ ఒకేసారి వెళ్లి, రావచ్చుననుకున్నారు.అందుకు ఒక ఆటోలో వెళ్తే సరిపోతుంది అనుకుంది ఆ మధ్య తరగతి కుటుంబం. ఇంటింటికి వచ్చి ఇచ్చిన పోల్ స్లిప్ చూస్తే కుటుంబంలోని భర్తకు ఒక పోలింగ్ కేంద్రం, భార్యకు మరో పోలింగ్ కేంద్రంలో ఓటు ఉన్నట్లు గుర్తించారు. పిల్లలిద్దరికీ ఒకే లొకేషన్ రావడం కొంతలో కొంత నయం. లొకేషన్ ఒకటే అయినా వారి పోలింగ్ కేంద్రాలు కూడా వేరే. దీంతో పిల్లలిద్దరు మాత్రం పోలింగ్ బూత్‌దాకా వెళ్లి ఓటేసినా.. భార్యాభర్తలకు చెరో చోట రావడంతో వారు వెళ్లలేదు.ఒక్కొక్కరు ఒక్కో వాహనం సమకూర్చుకోలేకపోవడంతో పాటు కలిసి వెళ్లలేక పోతున్నామనే తలంపుతోనూ వారు ఓటేసేందుకు ఉత్సాహం చూపలేదు. ఇది ఒక్క నియోజకవర్గంలోని ఒక్క కుటుంబం పరిస్థితి మాత్రమే కాదు. ఇలా ఒకే కుటుంబంలోని సభ్యులకు వేర్వేరు ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఓటుహక్కు ఉంటోంది. నగరంలో పోలింగ్ శాతం తగ్గడానికి ఇదీ ఓ కారణం. ఇలాఎందుకవుతుందో అంతుపట్టడం లేదు. ఈ పరిస్థితిని గమనించిన జిల్లా ఎన్నికల యంత్రాంగం ఈ పరిస్థితిని చక్కదిద్దే చర్యలకు ఉపక్రమించింది. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు 2023 మే నుంచి నవంబర్ మధ్య ఇలా ఒకే కుటుంబానికి చెందినప్పటికీ వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఉన్న 3,60,849 మంది ఓటర్లను కుటుంబమంతటికీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓట్లుండే చర్యలు చేపట్టింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత సైతం ఈ ప్రక్రియను కొనసాగించింది. 2024 మార్చి నెలాఖరు వరకు అలా 17,864 మంది ఒకే కుటుంబ ఓటర్లకు ఒకే పోలింగ్ కేంద్రం ఉండేలా చర్యలు తీసుకుంది. వెరసి మొత్తం 3,78,713 మంది ఓటర్లకు ఒక కుటుంబంలోని వారు ఒకే చోట ఓటు వేసేలా చర్యలు తీసుకున్నారు.





వైద్యులు, సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు

జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ

- ఫైర్‌సేఫ్టీ అధికారులు నాగార్జున, వెంకటరమణారెడ్డి
- ఆస్పత్రుల్లో మాక్‌డ్రిల్

తాండూరు టౌన్: అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు భయభ్రాంతులకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తాండూరు ఫైర్‌సేఫ్టీ ఆఫీసర్ నాగార్జున అన్నారు. అగ్నిప్రమాద నివారణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం తాండూరు పట్టణంలోని ఎస్వీఆర్ ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిప్రమాదం, షార్ట్‌సర్క్యూట్, సిలిండర్ పేలడం వంటివి జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రోగులను ఎలా కాపాడాలో ప్రదర్శన ఇచ్చారు. ఎఫ్ఎస్ఓ మాట్లాడుతూ.. వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశాలున్నాయని, తాగిపడేసిన బీడీ, సిగరెట్, వంటగదిలో ఆఫ్ చేయని గ్యాస్ సిలిండర్ తదితర వాటి వలన ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ఫైర్ కార్యాలయానికి సమాచారం అందజేయాలన్నారు. ఫైర్ సిబ్బంది, ఆస్పత్రి అధికారులు పాల్గొన్నారు.

ఫైర్ డ్రిల్ నిర్వహించాలి

అనంతగిరి: అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం వికారాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. ఆస్పత్రిలో అగ్నిమాపక పరికరాలను సరిచూసుకోవడానికి, అగ్ని ప్రమాదాలు జరిగినపుడు రోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ప్రతి అంతస్తులో ఫైర్ వార్డెన్‌ను నియమించాలన్నారు. ఆస్పత్రిలో 3నెలలకు ఒకసారి ఫైర్ డ్రిల్ నిర్వహించాలన్నారు. ప్రమాదం సమయంలో భయాందోళన చెందవద్దన్నారు. జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.



హెలికాప్టర్ @ మెరినాట్స్

వికారాబాద్‌లోని మెరినాట్స్ గ్రౌండ్‌లో బుధవారం ఓ ప్రైవేట్ హెలికాప్టర్ ల్యాండ్ అయ్యింది.చాలారోజుల తర్వాత ఇక్కడ హెలికాప్టర్ ఎందుకు ల్యాండ్ అయ్యిందా అని స్థానికులు ఆసక్తిగా తిలకించారు. కొడంగల్–నారాయణపేట్ ఎత్తిపోతల పథకం పనుల్లో భాగంగా ఈ హెలికాప్టర్ ద్వారా లైడార్ సర్వే నిర్వహించనున్నట్లు తెలిసింది. పది రోజుల పాటు ఈ సర్వే కొనసాగనుందని..అప్పటివరకు హెలికాప్టర్ వికారాబాద్‌లోనే ఉంటుందని సమాచారం. – అనంతగిరి

ఎన్నికలకు సై

సాక్షి, రంగారెడ్డిజిల్లా: సార్వత్రిక ఘట్టానికి సర్వం సిద్ధమైంది. లోక్‌సభ ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ వెలువడనుంది. ప్రధాన పార్టీలు ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించగా.. అధికార యంత్రాంగం ఆ మేరకు ఏర్పాట్లలో తలమునకలైంది. ఓటర్ల జాబితా సవరణ, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సిబ్బంది నియామకం, ఓటర్లను ప్రభావితం చేసే నగదు, మద్యం పంపిణీ వంటి అంశాలపై గట్టి నిఘా తదితర చర్యలు చేపట్టింది. ఓటింగ్ శాతం పెంచేందుకు ఏర్పాట్లు చేస్తుంది. యువత, మహిళలు, వృద్ధులకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తుంది. మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, హైదరాబాద్, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ఇప్పటికే రిటర్నింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్ల దాఖలు కోసం మంచి ముహూర్తాలను అన్వేషిస్తున్నారు. ఇప్పటికే పంతుళ్లను ఆశ్రయించి, ఏ రోజు నామినేషన్ వేయాలనే అంశంపై ఓ అంచనాకు వచ్చినట్లు తెలిసింది.

శుభ ముహూర్తాలు

- 18 గురువారం దశమి, మఘ నక్షత్రం మంచి రోజు కావడంతో అభ్యర్థులు సాదాసీదాగా వెళ్లి నామినేషన్లు వేసే అవకాశం ఉంది.
- 19న శుక్రవారం, ఏకాదశి, ముఖ నక్షత్రం మొదటి రోజుతో పోలిస్తే రెండో రోజే నామినేషన్లు వేసేందుకు మెజార్టీ అభ్యర్థులు మొగ్గు చూపుతున్నారు.
- 24న బుధవారం చైత్ర బహుళ పాడ్యమితో పాటు స్వాతి నక్షత్రం, చాలా బాగుంది. ఈ రోజు నామినేషన్లు సమర్పిస్తే.. అంతా మంచి జరుగుతుందనే నమ్మకం ఉంది.
- 22 సోమవారం చతుర్దశి, అష్టానక్షత్రం. నామినేషన్ల దాఖలు మంచి రోజు.
- 21న ఆదివారం త్రయోదశి, ఉత్తర నక్షత్రం.. పై ముహూర్తాల కంటే ఇది యోగ్యమైనది. కానీ ఆరోజు సెలవు కావడంతో అభ్యర్థులు ముందు రోజుల్లోనే నామినేషన్లు దాఖలు చేయాల్సి



వస్తుంది.

- గతంలో నామినేషన్ల కార్యక్రమం చాలా అట్టహాసంగా చేసే వారు. భారీగా జనాన్ని సమీకరించి, ర్యాలీగా వెళ్లి నామినేషన్లు వేసే వారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఎండలు భగ్గున మండుతుండటంతో పార్టీ శ్రేణులు సైతం బయటికి వెళ్లేందుకు జంకుతున్నాయి. ఈ నేపథ్యంలో సాదాసీదాగా నామినేషన్లు వేసే అవకాశం ఉంది.

నామినేషన్ల దాఖలు ఇలా

- అభ్యర్థులు నామినేషన్ ఫారం–2ఎ ను రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి ఉచితంగా పొందవచ్చు.
- ఒక అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేసుకునే అవకాశం ఉంది.
- అభ్యర్థి వెంట మరో నలుగురికి మాత్రమే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అనుమతి.
- జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల తరఫున పోటీ చేసే అభ్యర్థులకు వారు పోటీ చేస్తున్న నియోజకవర్గంలోని ఒక ఓటరు నామినేషన్‌ను ప్రతిపాదించాలి.
- అదే రిజిస్టర్ రాజకీయ పార్టీలు/ స్వతంత్ర అభ్యర్థులకు పది మంది ఓటర్లు నామినేషన్‌ను ప్రతిపాదించాల్సి ఉంది.
- అభ్యర్థులు 3నెలలలోపు దిగిన ఒక పాస్‌పోర్ట్ సైజు ఫొటోను అఫిడవిట్‌పై అతికించాలి.
- నామినేషన్‌పత్రంపై స్టాంప్ సైజు ఫొటో పెట్టాలి.
- ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వేరే పార్లమెంట్ సెగ్మెంట్‌కు చెందిన వారైతే విధిగా వారి అసెంబ్లీ సెగ్మెంట్ వీఆర్‌ఓ నుంచి ఓటరు ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంది.
- రిజిస్టర్/గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ ఫారంలోని పార్ట్–3లో సి కాలం ఎదుట ఎన్నికల సంఘం నిర్దేశించిన గుర్తుల్లో ఏదైనా మూడు గుర్తులను ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేసి, ఆ వివరాలను పొందుపరచాలి.
- పోటీ చేసే అభ్యర్థులు ప్రత్యేకంగా బ్యాంక్ అకౌంట్ తీసుకోవాలి.
- అభ్యర్థులు గరిష్టంగా రూ.95 లక్షల వరకు ఖర్చు చేసేందుకు అనుమతి.
- ఎన్నికల వ్యయానికి సంబంధించిన లావాదేవీల నిర్వహణ పక్కాగా నిర్వహించాలి.

నామినేషన్ల స్వీకరణ కోసం రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు, భద్రత కోసం చేవెళ్లలోని బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కాలేజీని ఎంపిక చేశారు. మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల, వికారాబాద్, పరిగి, తాండూరు అసెంబ్లీ నియోజకవర్గాలు చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో కొనసాగుతున్నాయి. వీటి పరిధిలో మొత్తం 29,28,186 మంది ఓటర్లు ఓటు హక్కును నమోదు చేసుకున్నారు. మొత్తం 2,877 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అదే విధంగా ఎన్నికల నిర్వహణకు 13,443 పోలింగ్ సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. ప్రతి అభ్యర్థి ఎన్నికల నిబంధనలు పాటించాలని.. అతిక్రమిస్తే చర్యలు తప్పవని అన్నారు.

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం

పార్టీ	అభ్యర్థి	నామినేషన్ వేయనున్న తేదీ
బీఆర్‌ఎస్	కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్	19
బీజేపీ	కొండా విశ్వేశ్వర్‌రెడ్డి	22
కాంగ్రెస్	గడ్డం రంజిత్‌రెడ్డి	25

నేడే లోక్‌సభ ఎలక్షన్ నోటిఫికేషన్

- ఆ వెంటనే నామినేషన్ల స్వీకరణ
- 18, 19, 24 తేదీల్లో శుభ ముహూర్తాలు
- నామినేషన్ల దాఖలుకు సమాయత్తమైన అభ్యర్థులు

షెడ్యూల్ ఇలా..

- మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ విడుదల
- ఏప్రిల్ 18న నోటిఫికేషన్
- ఏప్రిల్ 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ
- ప్రతి రోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ
- సెలవు రోజుల్లో నామినేషన్లు స్వీకరించరు.
- ఏప్రిల్ 26న నామినేషన్ల పరిశీలన
- ఏప్రిల్ 29న ఉపసంహరణ, అభ్యర్థుల తుది జాబితా విడుదల
- మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి
- జూన్ 6తో ఎన్నికల ప్రక్రియ ముగింపు.

క్లుప్తంగా

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కుల్కచర్ల: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన కుల్కచర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వీరాపూర్ గ్రామానికి చెందిన రెబ్బనమోని శ్రీనయ్య(37) అప్పుల బాధ తాళలేక ఈనెల 14న పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతన్ని పాలమూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అన్వేష్ రెడ్డి తెలిపారు.

ఆలయానికి పల్లకి అందజేత



ఆలయ నిర్వాహకులకు పల్లకి అందజేస్తున్న సభ్యులు

కేశంపేట: మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన పద్మశాలి సంఘం సభ్యులు 40వేల విలువ గల పల్లకిని బుధవారం అందజేశారు. గ్రామంలో నిర్వహించే పల్లకి సేవలకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో అందజేసినట్లు వారు తెలిపారు. దైవకార్యాలకు ఉపయోగపడే పల్లకీ అందజేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు విఘ్నేష్, రాఘవేందర్, శేఖరయ్య, శ్రీనివాసులు, కృష్ణయ్య, శంకరయ్య, శేఖర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

రూ.7.50 లక్షల విలువ ఉంటుందని పోలీసుల వెల్లడి

షాద్‌నగర్‌రూరల్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మంగళవారం సాయంత్రం ఎస్‌ఓటీ, షాద్‌నగర్ పోలీసులు పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా హన్మకొండ నుంచి డీసీఎం వాహనంలో 26.2 టన్నుల రేషన్ బియ్యాన్ని నారాయణపేట జిల్లా మరికల్‌కు తీసుకెళుతున్నారు. ముందస్తు సమాచారంతో శంషాబాద్ ఎస్ఓటీ, షాద్‌నగర్ పోలీసులు మంగళవారం పట్టణంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద మాటు వేసి పట్టుకున్నారు. రేషన్ బియ్యంతో పాటుగా డీసీఎంని పోలీసులు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. బియ్యం విలువ రూ.7.50 లక్షలు ఉంటుందని పోలీసులు వెల్లడించారు. రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఫరూఖ్‌నగర్ మండలం భీమారం గ్రామ పరిధిలోని మొల్లోనిగడ్డ తండాకు చెందిన పాత్లావత్ కిషన్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు డీఐ రామిరెడ్డి తెలిపారు.

ముగిసిన బీరప్ప ఉత్సవాలు



దంపతులను సన్మానిస్తున్న నిర్వాహకులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న బీరప్ప ఉత్సవాలు బుధవారం మహా మంగళ హారతితో ముగిశాయి. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ స్వప్నఅంజయ్యగౌడ్, బీరప్ప సంఘం నాయకుడు రవి దంపతులను నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నక్కలపల్లి గ్రామంలో బీరప్ప ఉత్సవాలను అందరూ కలిసి వైభవంగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి ఉత్సవాలు ప్రతి యేటా జరుపుకుందామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

కొందుర్గు: కంకల్ రోడ్డు నుంచి తుమ్మలపల్లి గ్రామం వరకు రోడ్డుకిరువైపులా మరమ్మతు పనులు చేపట్టారు. రోడ్డు పక్కన గుంతలు ఏర్పడటంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారని గమనించిన తుమ్మలపల్లి గ్రామస్తులు అబ్దుల్ అజీజ్, బంగారు రాములు, వడ్ల బ్రహ్మయ్య, మాణిక్యారావు ట్రాక్టర్ల యజమానులతో మాట్లాడి అందరు కలిసి మూడు కిలోమీటర్ల పొడవు రోడ్డు బాగుచేయించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారిని అభినందించారు.

కూలిన కల్వర్టులు ● తరచూ ప్రమాదాలు

మండిపడుతున్న వాహనదారులు ● పట్టించుకోని అధికారులు

మూడేళ్లయినా ముహూర్తం కుదరట్లే..!



ఎన్కేపల్లి కల్వర్టుపై ఏర్పడిన గుంత



నూరుల్లాపూర్ సమీపంలో కల్వర్టు దుస్థితి

కూలిన కల్వర్టులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. అటుగా వెళ్లే వాహనదారులు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణం సాగిస్తున్నారు. మూడేళ్లుగా అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకునే వారే కరువయ్యారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బంట్వారం: మండల పరిధిలోని రోడ్లు అధ్వానంగా మారాయి. దీనికితోడు అక్కడక్కడా కల్వర్టులు ధ్వంసమయ్యాయి. దీంతో ప్రయాణికులు ఆ మార్గం మీదుగా ప్రయాణమంటేనే జంకుతున్నారు. సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదంటూ ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లోని రొంపల్లి, నూరుల్లాపూర్, ఎన్కేపల్లి, కోట్‌పల్లి–తాండూరు మార్గంలోని కల్వర్టులు కూలి మూడేళ్లు గడుస్తున్నాయి. అయినప్పటికీ కొత్తగా నిర్మించడం లేదు. అసలే గుంతలు పడిన రోడ్లు దీనికి తోడుగా కల్వర్టులు కూలిపోవడంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. కొన్నిసార్లు ప్రాణాలు పోయిన సందర్భాలు ఉన్నాయి. ఎన్కేపల్లి రోడ్డులో మలుపు వద్దనే కల్వర్టు పై పెద్ద గుంత ఏర్పడింది. కొత్తగా ఆ రోడ్డు మీదుగా ప్రయాణం సాగించేవారు ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా గుంతలో పడాల్సిందే. ఇప్పటికే ఇక్కడ పలువురు గాయపడ్డారు. ద్విచక్ర వాహనదారులు రాత్రి వేళ అటుగా వెళ్లాలంటేనే జంకుతున్నారు. కూలిన కల్వర్టుల వద్ద లోడింగ్ లారీలు బస్సులు దిగబడే ప్రమాదం ఉంది. ఆర్‌అండ్‌బీ శాఖ తరఫున కనీసం హెచ్చరిక బోర్డులు సైతం పెట్టడం లేదు. దీంతో వాహనదారులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



కూలిన కల్వర్టుల దగ్గర తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రొంపల్లి, నూరుల్లాపూర్, ఎన్కేపల్లి తదితర మార్గాల్లో కల్వర్టులు కూలి మూడేళ్లు గడిచాయి. అయినా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదు. సమస్య తీవ్రత ఉన్నప్పటికీ కనీస మరమ్మతులు చేపట్టడం లేదు. ఇప్పటికైనా పాలకులు సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి. – నర్సింలు, రొంపల్లి

చర్యలు తీసుకుంటాం

కూలిన కల్వర్టుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. నూరుల్లాపూర్ సమీపంలో కల్వర్టు నిర్మాణానికి ఇప్పటికే నిధులు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ పూర్తి అయిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. ఎన్కేపల్లి, రొంపల్లి, కోట్‌పల్లి–తాండూరు మార్గంలోని కల్వర్టులకు ప్రతిపాదనలు పంపిస్తాం. నిధులు విడుదలయిన వెంటనే పనులు చేపడతాం. – శ్రీనివాస్, డీఈ

ఉపాధి పనులు చేస్తూ కూలీ మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య, తోటి కూలీలు

నవాబుపేట: తనతో పాటు రోజూ పనిచేసే భర్త అకస్మాత్తుగా విగతజీవిగా మారడంతో ఆ భార్య గుండెలవిసేలా రోదించింది. ఈ విషాద సంఘటన కడ్చర్ల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పసుల లక్ష్మయ్య(55) వ్యవసాయ కూలీ. రోజు మాదిరిగానే భార్య కిష్టమ్మతో కలిసి ఉపాధిహామీ పనులకు వెళ్లాడు. అక్కడ పనులు చేస్తూనే అకస్మాత్తుగా కింద పడిపోయాడు. భార్య, తోటి కూలీలు లేపడానికి ప్రయత్నించగా ఆయన విగతజీవిగా పడి ఉన్నాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. గుండె పోటు వచ్చి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. మృతుడి భార్య కిష్టమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భరత్ భూషణ్ తెలిపారు.

యువతి అదృశ్యం

మొయినాబాద్: ఆరుబయట బాత్‌రూంకు వెళ్లిన వెళ్లిన యువతి అదృశ్యమైంది. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం మండలం, రాఘవరెడ్డి కాలనీకి చెందిన అతిపాటి ఆదిశేషయ్య కొంత కాలంగా మండల పరిధిలోని చిన్నషాపూర్ గేటు సమీపంలో ఉంటున్నాడు. అతని సోదరుడి కూతురు లావణ్య(18) పది రోజుల క్రితం ఆదిశేషయ్య ఇంటికి వచ్చింది. బుధవారం ఉదయం బాత్‌రూంకు వెళ్తానని ఇంటి నుంచి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో పరిసర ప్రాంతాల్లో వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో మొయినాబాద్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. నెల్లూరు జిల్లా రాఘవరెడ్డి కాలనీకి చెందిన ప్రసాద్ అనే యువకుడిపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

షాద్‌నగర్‌రూరల్: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కందివనం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నాందేడ్ జిల్లాకు చెందిన సిద్ధార్థ తుకారాం కడేకర్(24) కుటుంబంతో కలిసి గత కొంత కాలం క్రితం షాద్‌నగర్‌కు వలస వచ్చారు. గ్రామంలో ఓ వ్యవసాయ క్షేత్రంలో సిద్ధార్థ వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. బుధవారం నీటి ట్యాంకులో ఆయన పడి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఏఎస్‌ఐ రాంచందర్ ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

చేపలు పట్టే విషయంలో ఘర్షణ

యాచారం: చెరువులో చేపలు పట్టే విషయంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. తక్కళ్లపల్లి–తక్కళ్లపల్లి తండా గ్రామాల మధ్యన ఉన్న చెన్నరెడ్డిచెరువులో మంగళవారం రాత్రి తండాకు చెందిన కొంత మంది చేపలు పట్టడానికి వెళ్లారు. ఇది గమనించిన తక్కళ్లపల్లి గ్రామస్తులు చేపలు పట్టే వారిని అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకుంది.

వరకట్నం వేధింపులకు వివాహిత బలి

నస్కల్‌లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న వైనం

పరిగి: అదనపు వరకట్నం కోసం భర్త, అత్తమామ పెట్టిన వేధింపులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న విషాద సంఘటన మండలంలోని నస్కల్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై సంతోషకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జైనబేగం, గౌస్ దంపతుల పెద్ద కుమార్తె షహీన్‌బేగం(24)ను పూడూర్ మండలం గొంగుపల్లి గ్రామానికి చెందిన రఫీకి ఇచ్చి ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహం చేశారు. ఆ సమయంలో పెద్దల సమక్షంలో రూ.16 లక్షల కట్నం ఇచ్చి పెళ్లి చేయించారు. కానీ పెళ్లయిన మరుసటి నెల నుంచి భర్త, అత్తమామ, ఆడపడుచు నిత్యం అదనపు కట్నం కోసం మానసికంగా, శరీరకంగా వేధింపులకు గురిచేశారు. వీటిని భరించలేక షహీన్‌బేగం తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి మాట్లాడాలని ఇరు కుటుంబ సభ్యులు నిర్ణయించారు. దీంతో ఈనెల 12న షహీన్‌బేగంను భర్త తల్లిగారి ఇంట్లో వదిలి వెళ్లాడు. దీంతో మానసికంగా బాధపడుతూ ఆమె మంగళవారం రాత్రి గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి జైనబేగం బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



మృతి చెందిన షహీన్‌బేగం

సమాజానికి ఉపయోగపడేలా పరిశోధనలు

చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ పురుషోత్తమ్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: ప్రస్తుత కాలంలో సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలని చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ పురుషోత్తమ్‌రెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి సాత్వికరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామ సమీపంలో గల యూనివర్సిటీలో భార్గవి, ప్రశాంత్‌రాజులు డాక్టరేట్ పొందారు. సూక్ష్మ జీవశాస్త్ర విభాగంలో 'ఎవాల్యూవేషన్ అఫ్ యాంటీ బ్యాక్టీరియా ఎన్‌డీ యాంటీ బయోఫిల్మ్ పోటెన్షియల్ ఆఫ్ సెలెక్టెడ్ ప్లాంటీ ఎక్సలెన్స్ ఎగ్రినేస్ట్ డిగ్రీ రెసిస్టెంట్ పాతోజేన్స్' అనే అంశంపై ప్రొఫెసర్ బి.శ్రీలత పర్యవేక్షణలో భార్గవి పరిశోధన చేశారు. అదే విధంగా రసాయన శాస్త్ర విభాగంలో 'సింథసిస్ అండ్ బయోలాజికల్ ఎలివేషన్ ఆఫ్ నైట్రోజన్ బెస్ట్ ఎటేరో సక్లిస్ట్' అనే అంశంపై ప్రొఫెసర్ జగదీష్‌కుమార్ పర్యవేక్షణలో ప్రశాంత్‌రాజ్ పరిశోధన చేశారు. ఈ సందర్భంగా వీరికి డాక్టరేట్ పట్టాను అందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రవీందర్, కవిత, రిసర్చ్ డీన్ కిష్టఫర్, డీన్ సైన్స్ ప్రొఫెసర్ సుందర్‌రామ్, అడ్మినిస్ట్రేషన్ రాజు, పబ్లిక్ రిలేషన్ అధికారి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



భార్గవికి పట్టాను అందజేస్తున్న యూనివర్సిటీ చాన్స్‌లర్ పురుషోత్తమ్‌రెడ్డి

గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా వినోద్‌కుమార్

షాద్‌నగర్: బీజేపీ గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా షాద్‌నగర్‌కు చెందిన జటావత్ వినోద్ కుమార్‌ను బుధవారం పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో బీజేపీని మరింత బలోపేతం చేస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి చైతన్య పరుస్తానని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి అఖండ మెజార్టీ అందించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళతానన్నారు. తాను చేస్తున్న సేవలను గుర్తించి పార్టీ అధిష్టానం జిల్లాస్థాయి పదవి ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్ నాయక్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్యలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



తరుణ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, చిత్రంలో కుటుంబసభ్యులు

పేదింటి బిడ్డకు పెద్ద కొలువు

సివిల్స్ ఫలితాల్లో ఐఏఎస్‌కు ఎంపికైన తరుణ్

మొదటి ప్రయత్నంలోనే విజయం

వ్యవసాయ కూలీ కుమారుడికి ఉన్నతోద్యోగం

పూడూరు: 'కృషి ఉంటే మనుషులు రుషులవుతారు' అనే నానుడిని నిజం చేశాడా ఆ యువకుడు. కష్టాల కడలిని ఈదుతూనే సివిల్స్‌కి సన్నద్ధమయ్యాడు. ఫలితంగా ఓ వ్యవసాయ కూలీ కుమారుడు ఐఏఎస్‌కు ఎంపికయ్యాడు. ప్రతిభ ఎవరి సొంతం కాదని నిరూపించి నేటి యువతకు ఆదర్శంగా నిలిచాడు తరుణ్. యూపీఎస్సీ వెల్లడించిన సివిల్స్ ఫలితాల్లో 231 ర్యాంకుతో మెరిశాడు.

వ్యవసాయ కూలీలు

పూడూరు మండలం మంచన్‌పల్లి గ్రామానికి చెందిన దయ్యాల బాబయ్య, శశికళ దంపతులకు ఒక కుమార్తె, కుమారుడు తరుణ్ ఉన్నారు. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీ పనులు చేస్తూ తరుణ్‌ను చదివించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో పదో తరగతి పూర్తి చేశారు. అనంతరం రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదివారు. విద్యాజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కాలేజీలో బీటెక్ పూర్తి చేశారు. 2023లో సివిల్ సర్వీస్ మెయిన్స్‌లో ర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు.

నాయకుల ప్రశంసలు

సివిల్స్‌లో విజయం సాధించిన తరుణ్ తల్లిదండ్రుల సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి. తమ బిడ్డకు అత్యున్నత ఉద్యోగం రావడంతో తమ కష్టాలు తీరిపోతాయని సంబురాలు చేసుకుంటున్నారు. సివిల్స్ ఫలితాల్లో జిల్లాకు చెందిన యువకుడి ఎంపిక కావడంతో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డితో పాటు మండల పరిధిలోని యువజన సంఘాల నాయకులు సన్మానించారు. మారు మూల గ్రామానికి చెందిన యువకుడు ఐఏఎస్‌కు ఎంపికకావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

ఆర్‌ఎస్‌పీ ఆదర్శం

ఎనిమిదో తరగతి చదువుతుండగా ఐపీఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఆదర్శంగా తీసుకుని ఎదగాలని కోరిక పుట్టింది. అప్పటి నుంచి బీటెక్ పూర్తి అయిన తర్వాత బాబాయి, స్నేహితుల సహకారంతో ప్రిపరేషన్ మొదలు పెట్టాను. చిన్నప్పటి నుంచి కడు పేదరికంలో మగ్గాను. ఉన్నతంగా చదివి కుటుంబానికి వెలుగులు తెద్దామని కష్టపడి చదివాను. సివిల్స్‌లో విజయం సాధించడానికి రోజుకు గంటల తరబడి పుస్తకాలతో కుస్తీ చేశాను. స్నేహితులు, బంధువుల సహకారంతో సామాజిక మాధ్యమాల ద్వారా ప్రిపేర్ అయ్యాను. ఎక్కువగా యూట్యూబ్‌లో పాఠాలు విని నేర్చుకున్నాను. తల్లిదండ్రులకు ఆర్థికంగా భారం కావొద్దని సొంతంగా పరీక్షలకు సిద్ధం అయ్యాను. మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించడం చాలా సంతోషంగా ఉంది.

సివిల్స్‌లో గిరి పుత్రుడి సత్తా



షాద్‌నగర్‌వాసికి 891వ ర్యాంకు

అఖిల భారత సర్వీసుల్లో ఉద్యోగం సాధించాలని ఎందరో కలలు కంటారు. దానికి నిర్దిష్టమైన ప్రణాళిక రచించి, కఠోర సాధన చేస్తే తప్ప దాన్ని అందుకోవడం సాధ్యం కాదు. అలాంటి కలను షాద్‌నగర్‌వాసి సాకారం చేసుకున్నాడు. ఇటీవల వెల్లడించిన సివిల్స్ ఫలితాల్లో సత్తా చాటాడు.

షాద్‌నగర్: అఖిల భారత సర్వీసుల్లో నియామకాల కోసం యూపీఎస్సీ (యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) నిర్వహించిన సివిల్స్ ఫలితాల్లో రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ వాసి సత్తా చాటాడు. మంగళవారం వెలువడిన ఫలితాల్లో 891వ ర్యాంకుతో మెరిశాడు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం మాచారం గ్రామ పరిధిలో చాకలిదాని తండాకు చెందిన రాములు నాయక్, సీతమ్మ దంపతుల పెద్ద కుమారుడు శశికాంత్. తండ్రి రాములు నాయక్ హాస్టల్‌లో వార్డెన్‌గా పని చేస్తూ షాద్‌నగర్ పట్టణంలోని విజయ్‌నగర్ కాలనీలో స్థిరనివాసం ఏర్పర్చుకున్నారు. ఆయన 2008లో అకస్మాత్తుగా మృతి చెందడంతో అప్పటి నుంచి తల్లి పిల్లలను చదివిస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. శశికాంత్ షాద్‌నగర్ పట్టణంలోని మరియారాణి ఉన్నత పాఠశాలలో 1 నుంచి 8వ తరగతి వరకు విద్యాభ్యాసం చేశారు. ఆ తర్వాత నాగర్‌కర్నూల్ జిల్లా వట్టెం నవోదయలో 9, 10వ తరగతులు చదివారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని మియాపూర్ గుంటూరు వికాస్‌లో ఇంటర్, విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్(ఈఈఈ) పూర్తి చేశారు.

పట్టువదలని విక్రమార్కుడిలా..

ప్రభుత్వ ఉద్యోగం సాధించాలి, ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగిన శశికాంత్ ఎన్ని ఉద్యోగాలు వచ్చినా వాటిని వదులుకున్నారు. 2011లో ఇన్ఫోసిస్‌లో ఏడాదికి రూ.11లక్షల ప్యాకేజీతో, 2012లో పశ్చిమ బెంగాల్‌లో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియాలో ఏటా రూ.12లక్షల ప్యాకేజీతో ఉద్యోగం వచ్చింది. అయినా వాటిల్లో చేరకుండా సివిల్స్ వైపు దృష్టి మళ్లించారు. 2013లో ఢిల్లీ వెళ్లి సివిల్స్‌కు సిద్ధం అయ్యారు. మూడుసార్లు ప్రిలిమినరీ వరకు వచ్చారు. 2019లో కేవలం 6 మార్కుల తేడాతో అవకాశం కోల్పోయారు. 2020లో ఆరో ప్రయత్నంలో సివిల్స్‌లో 695 ర్యాంకు సాధించిన శశికాంత్‌ను యూపీఎస్సీ అధికారులు ఐఆర్‌టీఎస్ (ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్)కు కేటాయించారు. ప్రస్తుతం అస్సాంలో రైల్వేశాఖలో పని చేస్తున్నారు.

చదువుతూ.. ఉద్యోగం చేస్తూ

అస్సాం రాష్ట్రంలోని రింగియా డివిజన్‌లో రైల్వే విభాగంలో అసిస్టెంట్ ఆపరేషన్ మేనేజర్‌గా శశికాంత్ విధులు నిర్వర్తిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖలో విధులు నిర్వర్తిస్తూనే మరోసారి సివిల్స్‌కు ప్రయత్నించారు. ఇప్పటి వరకు 8సార్లు పరీక్షలు రాసిన శశికాంత్ మూడు సార్లు ర్యాంకులు సాధించారు. ఐఏఎస్ కావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సివిల్స్ సర్వీసెస్ తుది పరీక్ష ఫలితాలు మంగళవారం వెల్లడించింది. మొత్తం 1,016 మందిని ఎంపిక చేయగా శశికాంత్ 891వ ర్యాంకు సాధించి శెభాష్ అనిపించుకున్నారు.

పశువుల బీమా.. రైతుకేది ధీమా!

● ఏడేళ్లుగా నిలిచిన ఇన్స్యూరెన్స్ పథకం

● నష్టపోతున్న పాడిరైతులు

● పట్టించుకోని అధికార యంత్రాంగం

దౌల్తాబాద్: రైతు సంక్షేమమే ధ్యేయంగా అనేక పథకాలు ప్రవేశ పెట్టామని ప్రభుత్వం ఊదరగొడుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్త పథకాల అమలుతో పలువురు రైతులు లబ్ధి పొందుతున్నారు. కానీ కొన్నేళ్లుగా పాత పథకాలు మాత్రం నిర్వీర్యం అవుతున్నాయి. అందులో భాగంగా గత ప్రభుత్వం వ్యవసాయ పనిముట్లు, యంత్ర పరికరాలపై సబ్సిడీపై ఎత్తివేయడంతో పాటు పాడి పశువులకు బీమా పథకం నిలిపివేసింది. దీంతో పాడి రైతులు గొర్లు, మేకల పెంపకందారులు తీవ్రంగా నష్టపోతున్నారు. బీమా నిలిపివేతతో మూగజీవాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నా కష్టజీవులకు భారంగా మారింది.

ప్రభుత్వమే ప్రీమియం చెల్లించేది

గతంలో పశువుల బీమా పథకంలో భాగంగా ఇన్స్యూరెన్స్ ప్రీమియం డబ్బులను సగం రైతులు, మరో సగం ప్రభుత్వం చెల్లించేది. దీంతో రైతులకు కొంత ఊరట ఉండేది. గేదెలు, ఆవులకు మూడేళ్లకు సరిపడా ఇన్స్యూరెన్స్ ప్రీమియం రూ.4వేలు ఉండగా ప్రభుత్వం రూ.రెండు వేలు చెల్లించేది. ఈ మూడేళ్ల కాలంలో పాడిరైతుకు చెందిన పశువులు ప్రమాదవశాత్తు మృతి చెందితే వాటి రకాన్ని బట్టి రూ.40వేల నుంచి రూ.8వేల వరకు ఇన్స్యూరెన్స్ నగదు వచ్చేది. ప్రస్తుతం రైతులు ఈ అవకాశాన్ని పొందలేక తీవ్రంగా నష్టపోతున్నారు. దాదాపు మూడు వేల కుటుంబాల పశు పోషణ, గొర్ల, మేకల పెంపకందారులు బీమా నగదు నోచుకోక ఇబ్బంది పడుతున్నారు.



ఎప్పటిలాగే కొనసాగించాలి

గత ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన గొల్ల, కురుమల కోసం గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. పథకంలో భాగంగా గొర్లకు ఉచిత బీమా సౌకర్యం కల్పించింది. కానీ ప్రభుత్వం ఒక ఏడాదికి సంబంధించిన ప్రీమియం మాత్రమే చెల్లించింది. గడువు ముగిసిన తర్వాత గొర్లు చనిపోతే బీమా వర్తించని కారణంగా పెంపకందార్లు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం గతంలో పంపిణీ చేసిన గొర్రెలతో పాటు గేదెలు, ఎద్దులు, ఆవులకు సైతం ఎప్పటిలాగే 50శాతం నిధులను కెటాయించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. దీనిపై దౌల్తాబాద్ పశువైద్య సహాయకుడు సత్యనారాయణరెడ్డిని వివరణ కోరగా.. పశువులకు సబ్సిడీ లేదు. ఉన్నతాధికారులకు వివరించామని తెలిపారు. ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.